
సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లి కథల పోటీ

# చదువుల సాకెళ్ళు...

యం.వి.శ్రీధరరావు

ఉదయం ఎనిమిది గంటలు అయ్యింది.

మట్టిరోడ్డు మీద నడిచి వెళుతూ వరుసగా ఉన్న గుడిసెలు దాటి సూరిబాబు ఇంటి ముందుకొచ్చేసరికి వాళ్ల నాన్న అరుపులు వినిపిస్తున్నాయి. మధ్య మధ్యలో సూరిబాబు నసుగుడు..వాళ్లమ్మ ముక్కు చీదడాలు వినబడు తున్నాయి. ఉండబట్టలేక ముందు గుమ్మం దాటి వాళ్ల దొడ్లోకి ప్రవేశించాను. అది విశాలమైన దొడ్డి. చుట్టూ ప్రహారి గోడ మధ్యలో పెంకుటిల్లు. ఓ వారగా గేదెల పాక. గుమ్మానికెదురుగా పెళ్ల అరుగు. దానికి కొంచెం అవతల గడ్డిమేటు. దాని మీద పచ్చగా ఉన్న ఆనప్పాదు. ఆనప్పాదు నిండా చిన్న చిన్న పిందెలు మంచుకి తడిసి మెరుస్తూ ఉన్నాయి. పాలేరు పాలు పితుకుతున్నాడు.



## సాధారణ ప్రచురణ (రూ. 1,000)కు ఎంపికయిన కథ

సూరిబాబు వాళ్లమ్మ పొయ్యి రాజేస్తోంది. వాళ్ల నాన్న గుమ్మం పక్క పడక కుర్చీలో కూర్చుని పొగ గుప్పుగుప్పుమని వదులుతున్నాడు. మధ్య మధ్యలో సూరిబాబుకేసి చూసి మళ్లీ ఏదో గొణుక్కుంటున్నాడు.


సూరిబాబు నన్ను చూసి''రండి మాష్టారు'' అని లేచి నుంచున్నాడు. ఆ మాట విని సూరిబాబు నాన్న స్వామి నాయుడు ఇటువైపు తిరిగి''రండి.. రండి..మాష్టారు. ఇయ్యాలప్పుడు ఇలా వచ్చారేంటి ఏవన్నా ఇశేసవాఁ'' అన్నాడు.

''అబ్బే ఏమీ లేదండీ..అలా స్కూలు కేసి నడుస్తుంటే మీ మాట వినబడి ఇలా వచ్చాను'' అన్నాను. సూరిబాబు చెక్క కుర్చీ తెచ్చి వేశాడు. కూర్చున్నాను.

''ఏవుందండీ రోజూ ఉండే బాగోతమే.. ఈడి సదువై రెండేళ్లయ్యిందాండి. ఇయ్యాల వరకూ పని లేదు పాటూ లేదు. రోజూ పేపరెతకడం. దానికీ దీనికీ కాయితాలెట్టడం. దానికి నాకాడ వంద లొందలు డబ్బులు గుంజడం'' అన్నాడు.

''అవునండీ.. నాయుడు గారూ..మరి చదువుకున్నాడు కదా. ఉద్యోగం వెతుక్కోవాలి కదా'' అన్నాను.

''ఏం ఉజ్జోగవండీ! చదువైన కాడ్నించీ సూత్తానే వున్నా. ఎల్టం,రావటం..నా కాడ డబ్బులెట్టుకెల్టం అంతే కదా! ఇంత వరకూ ఏమీ పనవ్వలేదు. పోనీ నాతో పొలం రారా అంటే రాడు'' అని ఉక్రోషంగా అన్నాడు. మళ్ళీ ఆయనే అన్నాడు. ''వచ్చి మాత్రం ఏం చేస్తాళ్ళేండి. ఎదవకి చేలో ఏసింది గడ్డో వరో కూడా తెల్దు'' అన్నాడు. అని పడక్కుర్చీలోంచి కాస్త ముందుకు వంగి కాస్త గొంతు తగ్గించి ''మీకు నాకు చనువు కదా అంచేత అసలు ఇసయం సెప్తున్నా. ఏటంటేనండీ మావోళ్లలో ఇంతకాలం పెళ్లవకుండా ఉండదండీ. ఈ మద్దెన సంబంధాలొత్త



న్నాయి. ఈడేమో ఉజ్జోగం రావాలంటాడు. అదెప్పుడొత్తదో, ఈడి పెళ్లెప్పుడవుద్దో, నాకు మనవడెప్పుడొత్తాడో..''అని నిర్వేదంగా నిట్టూర్చాడు. ఒక సారి ఆగి, ''అసలు బతికుండగా అవుద్దంటారా?''

అప్పుడాయన ముఖంలో చూశాను. ఎన్నాళ్ల నుంచో బాధను దాచుకుని, అది బాగా ఆత్మీయులైన వారికి చెప్పిన తరువాత ఎంత ప్రశాంతంగా, తేలికపడ్డట్టుగా ఉంటుందో అలా వుంది. సూరిబాబుకి ఉద్యోగం రాలేదనీ, అతడు పనీపాటా లేకుండా తిరుగుతున్నాడనీ, అందుకే నాయుడు బాధపడుతున్నాడనీ ఇన్నాళ్ళూ అనుకున్నాను. ఇప్పుడు అతని మనసులో ఉన్న నిజమైన బాధ నాకర్థమైంది.

నిజంగా ఆయనా నేనూ ఆత్మీయులమే.

పదిహేనేళ్ల క్రితం నేను ఈ ఊరు ఉద్యోగానికి వచ్చినప్పుడు మొదట నాకు కలిసింది ఆయనే. మాది రావులపాలెం అయినా ఉద్యోగం మాత్రం తొండంగిలో వచ్చింది. పల్లెటూళ్లో ఉద్యోగం అనే సరికి ఎక్కడ ఉండాలి, ఎలా వుండాలి అనేవి పెద్ద సమస్యలుగా ఉంటాయి. బి.ఇ.డి.పూర్తి చేసిన వెంటనే డీఎస్సీ రాయడం, ఉద్యోగం రావడం జరిగాయి. స్కూల్లో జాయినవడానికి వెళ్ళిన రోజది. ఊళ్లో బస్సు దిగి రోడ్డు పక్క వారగా నుంచున్నాను.

ఎటు వెళ్ళాలి? స్కూలు ఎక్కడుందో? అనుకుంటూ ఉన్నాను. మట్టిరోడ్డు మీద ఒక గడ్డి ట్రాక్టరు వేగంగా దూసుకుపోయింది. అది లేపిన దుమ్ము ఒక్కసారిగా ముఖమ్మీద కమ్మేయడంతో ఉక్కిరిబిక్కిరయి బాగా దగ్గొచ్చింది. పక్కనే ఉన్న కాకా హోటల్లో టిఫిన్ తింటున్న ఒక వ్యక్తి నన్నే చూస్తున్నాడు. అతను టిఫిన్ తినడం పూర్తి చేసి చేతిని భుజం మీదున్న తువ్వాలుకి తుడుచుకుంటూ..నా దగ్గరి కొచ్చి ''ఎవరండీ మీరు ఏ పని మీదొచ్చారు?'' అన్నాడు.

## రచయిత పరిచయం



**వృత్తి: భౌతిక శాస్త్ర అధ్యాపకుడు. ప్రవృత్తి: కథలు, కవితలు రాయడం, మంచి సంగీతం వినడం. నా కథను సాధారణ ప్రచురణకి ఎంపిక చేసిన సి.పి.బ్రౌన్ అకాడమీ-నవ్య వీక్లి వారికి ధన్యవాదాలు.**

**-ఎం.వి.శ్రీధరరావు**

ఆ వ్యక్తి కేసిచూశాను. మంచి ఎత్తుగా లావుగా ఉన్నాడు. ఉంగరాల జుట్టు కండలు తిరిగిన చేతులు చూస్తే బాగా వ్యవసాయప్పనులు చేసే మనిషిలా కనిపించాడు.

''నేను ఈ ఊరికి కొత్తగా వచ్చిన మాష్టారుని స్కూలు ఎక్కడో చెబుతారా?'' అనడిగాను.

''బడాండి? ఈ వంతెన దాటి కొంచెం ముందు కెళ్లండి చెరువు వత్తాదండి. దానికి కుడేపు వెళితే బడుంటాదండి'' అన్నాడు.

''సరేనండి అయితే నే వెళతాను'' అని ముందుకు రెండడుగులు వేశాను. అతను ఏదో ఆలోచించి ''మీదేవూరు మాష్టారు'' అన్నాడు. ''రావులపాలెం'' అన్నాను. ''రోజూ అక్కణ్నించే వత్తారాండీ''అనడిగాడు.

''అంతేమరి'' అన్నాను. ఇద్దరం నడుస్తున్నాం.

''భలేవారే రావులపాలెం చానా దూరం కదండీ, రోజూ తిరిగితే జబ్బుడిపోతారు. మా మావయ్య ఇంటికాడ రెండు వసారా గదులు ఖాళీగా ఉన్నాయి దాంట్లో దిగిపోండి'' అన్నాడు.

నాకు పెద్ద భారం దిగిపోయినట్టయింది. ఈ అపరిచిత ఊళ్లో ఎలా వుండటం అని గత వారం రోజులుగా కిందామీదా పడుతున్నాను. అది ఒక చిటికెలో పరిష్కారమైపోయింది.

మాష్టార్లు చాలా మంది దూరాల నుంచి స్కూళ్లకి వస్తారు. కానీ నాకెందుకో పల్లెలోనే ఉండాలని కోరిక. ఇంకా పిల్లలెవరూ లేరు కాబట్టి చదువు సమస్య లేదు. హాయిగా పల్లెటూళ్లో కొన్నాళ్లు గడపొచ్చని నా ఆశ. ఆ వ్యక్తి అడుగుతున్నాడు, ''మీకు పెళ్లయిందాండి'' అయిందని చెప్పాను.

''సాయంత్రం బడైపోయాక మీరిక్కడే వుండండి నేనొచ్చి మీకు ఇల్లు చూపిస్తాను'' అన్నాడు. అని వెళ్లబోతూ వెనక్కి తిరిగి ''మద్దినేల తిండానికేవన్నా ఉందాండి'' అనడిగాడు. కారేజీ ఉందన్నాను. అతని ఆరాలు నాకు చిత్రంగా అనిపించినా అతని శ్రద్ధ నన్ను ఆకట్టుకుంది. అప్పుడడిగాను.

''మీ పేరేంటండి?''

''నన్ను స్వామినాయుడంటారండి. పెద్ద నూతికాడ మా ఇల్లండి. సందాల తీసుకెళ్తానండి'' అని వెళ్ళిపోయాడు.

అదీ మా పరిచయం. ఆ ఊళ్లో నేనెన్నడూ పరాయివాడిగా భావించుకునే పరిస్థితి రాలేదంటే దానికి కారణం నాయుడే. సుమారుగా అతడు నా వయసు వాడే. కాకపోతే కాయకష్టం చేసే మనిషి కాబట్టి నాజూకు లేక కాస్త పెద్దవాడనిపిస్తాడు.

అప్పట్నుంచి ఇప్పటివరకూ మా కష్టాలు సుఖాలు పంచుకుంటూ వచ్చాం. వ్యక్తిగా అతను మంచివాడు. చదువులేదన్న మాటే గానీ చాలా తెలివైనవాడు. ఎలాగ ఈ పల్లెలో గడపడం అనుకుంటూ వచ్చిన వాణ్ని అదే మండలంలో ఊళ్లు మారినా నివాసం మాత్రం అక్కడే ఉండిపోయాను. కాలంతో పాటు, వయసుతో పాటు మా స్నేహం కూడా పెరుగుతూ వచ్చింది.

ఒకరోజు స్వామినాయుడు తన కొడుకు సూరిబాబుని స్కూలుకి తీసుకొచ్చాడు. అప్పుడు వాడికి ఏడు సంవత్సరాలుంటాయి.

''మేట్టారు, ఈణ్ని బళ్లో ఎయ్యమని మా ఇంట్లో వాళ్ళందరూ పోరెడతన్నారండీ. మనకా సదువు లేదు. చిన్నప్పుడు స్కూలుకెళ్ళమంటే బెచ్చాలు, గోలీ కాయలు ఆడుకునేవాళ్ళం. చెర్లో దిగి ఈతలు కొట్టి బడైపోయాక సంచీ భుజానేసుకుని ఇంటికిపోయే వోణ్ణండి. ఈడు కూడా అలాగైపోతాడేమోనని భయమండీ ఆళ్లకి. నాకు తెలవకడుగుతానండి మాష్టారు, సదువుకోకుండా నేనేవన్నా సెడిపోయానాండి. పొలాలమ్మట తిరిగేనండీ. మా



## బప్పి నటిస్తున్నాడోచ్!

బప్పి లహరి నటించడమేంటని అనుకుంటున్నారా? అవునండీ, నిజమే. అశోక్ త్యాగీ చిత్రం 'డార్క్- ఇ- డిస్కో'లో బప్పీ నటిస్తున్నాడు. ముంబై పరిసర ప్రాంతాల్లో ఉన్న నైట్‌క్లబ్‌ల వ్యవహార శైలిపై ఈ సినిమాను తీస్తున్నారు. ''అవును, ఈ కథ నాకు చాలా బాగా నచ్చింది. ఇది తప్పకుండా నా కెరీర్‌ను మలుపు తిప్పుతుంది'' అంటున్నాడు విఖ్యాత సంగీత దర్శకుడైన బప్పీ. ''ఇందులో బప్పీదా క్యారెక్టర్ జోవియల్‌గా ఉంటుంది. ఈ పాత్రకు అన్ని విధాల బప్పీనే కరెక్టు అనుకున్నాను. అందుకే ఈ పాత్ర గురించి బప్పీతో మాట్లాడాను. డిస్కో కింగ్ జీవితంలో జరిగిన సంఘటనలే కథాంశంగా తీసుకున్నాము'' అన్నారు దర్శకులు అశోక్ త్యాగీ. చూద్దాం ఆయన సంగీతంలాగే ఆయన నటన ఏ లెవల్‌లో వుంటుందో!

నాన్నతో చేలో దిగి కలుపు తీసేనండి. ఎవసాయంపనులు నేర్చానండీ. ఏసం కాలంలో కొబ్బరి తోట దున్నేనండీ. ఇయ్యాల నా చేలో ఏ మొక్కేస్తే పెరుగుతుంతో నాకు తెల్సండి. ఏ కొబ్బరి చెట్టు ఎన్ని కాయలు దిగుద్దో తెల్సండి.. మరి నేను పనోణ్ని కాదేటండీ? ఉన్న చేనూ చుట్టూ ఒబ్బిడి చేసుకుంటే చాల్డండీ..సదువు లేకపోతే ఏంటట?'' అన్నాడు ఎగతాళిగా.

ఇదొక విచిత్రమైన లక్షణం నాయుడిలో. ఊళ్లో అందరూ అయ్యో, మేం చదువుకోలేదు అందుకే ఇలా మట్టి పిసుక్కుంటున్నాం. మా పిల్లల్ని చదివించి పేద్ద ఉద్యోగస్తుల్ని చేస్తామని పిల్లల్ని బళ్లోనూ.. పట్నం కాన్వెంటుల్లోనూ వేస్తుంటే పాత కాలపు మనిషిలా ఈ నాయుడు..

''కరెక్టే గానీ చదువు లేకపోతే లెక్కలు అవీ ఎలా తెలుస్తాయండీ. చదువుకుంటే ఇంకా బాగా పని చేయవచ్చు కదా'' అన్నాను. పైకి అలా అంటాడు గానీ నాయుడికీ తన కొడుకు చదువుకోవాలనే కోరిక ఉండదా అని మనసులో అనుకున్నాను కూడా.

''సరే మీరూ అలాగే అంటున్నారా! అయితే ఈణ్ని మీ చేతుల్లో ఎడుతున్నాను. ఈణ్ని మారాజునే చేస్తారో మట్టిబెడ్డనే చేస్తారో మీ ఇట్టం'' అని బళ్లో పేరేయించి వెళ్లిపోయాడు.

అప్పట్నుంచి సూరిబాబుకి గైడు, ఫిలాసఫర్ అన్నీ నేనే. సూరిబాబుని బాగానే చదివేడు. మంచి కుర్రాడు.

''ఏమయ్యో మాట్టారు ఏటాలోచిస్తున్నావు. మా తగువు మద్దెలో వదిలేసి?'' అని నాయుడు అనడంతో ఈ లోకంలోకి వచ్చాను.

''ఏవుంది రోజూ ఉందే కదా. మీ సూరిబాబు తెలివైనవాడు. కాస్త ఆలస్యమైనా మంచి ఉద్యోగం రాక మానదు. అప్పుడు చెబుతాం'' అన్నాను నవ్వుతూ..

వెంటనే వాళ్లావిడ అందుకుంది.

''అలా చెప్పండి బాబూ ఆ మనిషికి. ఎంత సేపూ అయ్యే మాటలు, అయ్యే తిట్లు''

''నువ్వలాగే ఎనకేసుకురా ఆడు ఎందుకూ కాకుండాపోతాడు'' అని తగులుకున్నాడు నాయుడు. ఇద్దరూ మళ్లీ వాగ్యుద్ధంలోకి దిగారు. ఈ సందులో నేను మెల్లిగా జారుకున్నాను.

రోడ్డు మీద నడుస్తుంటే నాయుడు ఆ రోజు అన్న మాటలు గుర్తొచ్చాయి. 'వ్యవసాయం చేస్తూ నేనేమైనా పాడయ్యానా?'

నిజమే కదా! ఆయన ఎందుకూ పనికి రాకుండా ఉన్నాడా? సూరిబాబు ఎందుకూ పనికి రాకుండా ఉన్నాడా? ఉద్యోగం లేకుండా ఉండడం ఎంత లోకువో..అనుకున్నాను.

* * *

తెల్లవారు జామున గంటసేపు నడవడం అలవాటు నాకు. ఒకరోజు పొద్దున్నే శీతకాలపు ప్రత్యూష వేళల సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ రోడ్డు మీద నడుస్తున్నాను. రోడ్డుకి అటు ఇటూ చెట్లు, దాని వెనక వరిచేలు. అరటి, మిరప తోటలు ఉన్నాయి. డిసెంబరు నెల. మంచు పడుతోంది. మంచు బిందువులు ఆకుల మీద నుంచి కింద పడ్డం లయబద్ధంగా వినపడుతోంది. చేల మీంచి చలిగాలి నెమ్మదిగా నన్ను చుట్టి రోడ్డుకి అటు వైపున్న చేలోకి పోయింది. ఆకుల చివర వేళాడుతున్న మంచు బిందువులు లేత ఎండలో ముత్యాల్లా మెరుస్తున్నాయి. అలా నడుస్తూ నాయుడి పొలంకేసి వచ్చాను. పొలంలో నాయుడు, సూరిబాబు కనిపించారు.

''ఏమిటి నాయుడు గారు సూరిబాబుని కూడా పొలంలోకి దింపేశారే'' అని పలకరించాను.

నాయుడు చూసి తలపాగా విప్పుకుంటూ వచ్చి ''ఇయ్యాల చేలో ఎండ్రిన్ కొట్టాలండి. ఇద్దరు కూలోళ్ళనెట్టాను. సూరుడు రాకుండా రమ్మన్నాను. ఇంకా వచ్చారు కాదు. ఈ కూలోళ్ళతో మా చెడ్డ బాధగా వుందండి మాట్టారు. పనుంటే మనం మూడు రోజుల ముందే చెప్పాలి. లేకపోతే రారు. ఇటుక బట్టీల్లోకో, కాకినాడ పోర్టులో పనుల్లోకో పోతారు. నూటేభై రూపాయలు ఇచ్చి కాఫీ, టిఫిన్లు పెట్టాలి. ఆడొచ్చేలోగా మందు రెడీ చెయ్యాలి. అప్పుడాడొచ్చి మందు కొట్టి పోతాడండి. ఒకేల రాలేదనుకోండి ఇంక మనమే దిగాలి. లేదా వదిలేయాలి. వదిలేయగలమా ? తెగులొచ్చి పడిపోద్ది'' అంటూ గట్టునున్న కొబ్బరిచెట్టు కిందకి దారి తీశాడు. కింద వట్టి గడ్డి వేసుంది. దాని మీద కూర్చున్నాం ఇద్దరం. ఫ్లాస్కులోంచి కాఫీ తీసి మూతలో పోసి ఇచ్చాడు. తను ఇంకో గ్లాసులో పోసుకుని తాగుతూ మొదలు పెట్టాడు.

''ఈ రెండో పంటుంది చూశారా చానా చిరాకండి. ఈ కాలం అసలు వరికి పనికి రాదండి. ఒక్క వరికేటండీ శానా పంటలకి పనికి రాదండి. మొత్తం పంటలంతా మందుల మీదే నడవాలండీ. పొగమంచట్టిందనుకోండి అది నీళ్లలా పడితే పర్లేదండి. ఒకేల జిగురుగా పడిందనుకోండి బూడిద తెగులండీ. గింజ తయారవదు. దాని కోసం మందు కొట్టాలి. ఆ మందు పదిహేను రోజులు కాత్తాదండీ. ఇవికాక వరికి ఊడ్చిన కాణ్ణించి, కోసే ముందు వరకూ తడుండాలండీ. కరెంటు పోయినా, పంపు చెడిపోయినా, అంతేనండీ చేనొదిలేయడమే'' అని ఓ దణ్ణం పెట్టాడు.

సూరిబాబు స్ప్రేయర్‌కి గాలి కొడుతున్నాడు. బాగా విసిగిపోయున్నాడు నాయుడు. మళ్లీ మొదలు పెట్టాడు.

''అంతేనా గుళికలేయాలి. అయి భలే కంపండి. ఆ కంపు గాల్లో వదిలినంత దూరం దోమ సచ్చిపోద్దండి. ఊడ్చే ముందు దమ్ములో ఎరువెయ్యాలండీ. ఒక పని కాదండీ, ఒక యవ్వారం కాదండి. కడాకరుగా ఏటంటే పస్టుక్రాపు పర్లేదనుకోండి గానీ ఈ సెకండు క్రాపులో బియ్యం అంతా ఇసమేనండి. అదే మనం తింటావండి. కోసే పది రోజుల ముందు కూడా మందు కొట్టాలండి. ఆ మందు నలభై రోజులుంటాదంట. మరి ఆ బియ్యం ఇసం కాకేటవుద్దండి'' అని కాఫీ గ్లాసుని పక్కన పంట బోదిలో కడిగేసి మళ్లీ కాఫీ పోసి,''సూరిబాబు'' అని కొడుకుని పిలిచాడు. సూరిబాబు వచ్చి గ్లాసు తీసుకుని కాస్త దూరంగా వెళ్లి ౼ాగుతున్నాడు.


నేను నాయుడు చెప్పింటానికి మామూలుగా ''ఎందుకంత మందు వాడడం'' అన్నాను.

అతడు నవ్వాడు. నవ్వి,

''ఎందుకేటండి! పూర్వం పస్టుక్రాపు తర్వాత చేలో పైరు జల్లి వదిలేసే వాళ్లండి. దూళ్లు తిరిగి తిన్నంత తిని పేడేసిపోయేవండీ. కొంతమంది జనుమేసే వారండి. దమ్ము చేసినప్పుడు దాన్ని అలాగే దున్నేసే వాళ్ళండి. దాని వల్ల భూమికి సారం ఉండేది. ఇప్పుడు భూమిలో సారమేది. పంటెనక పంట. సత్తువంతా పీల్చేత్తంటే పంటలేడ పండుతాయి. అందుకే ఎరువులు, మందులు'' అన్నాడు. అతని గొంతులో సన్నని బాధ ధ్వనించింది.

''మరైతే ఓ పంటొదిలేయొచ్చు కదా''






''భలేవారే, పంటొదిలేత్తే ఇల్లెలా గడవాలండీ బాబు''

''ఆ..మరి పూర్వం గడవలేదేంటి''

''అప్పుడు వేరు, ఇప్పుడు వేరండీ'' అన్నాడు. అని ''ఇప్పుడెన్ని ఖర్చులు. మావోణ్ణి సదివించినాం కదా ఉజ్జోగం దొరకడానికి ఆడికి పట్టుకి రెండొందలివ్వాలి. ఇస్త్రీ బట్టలు నలక్కూడదు. ఇంట్లో వాళ్ళు పండిన బియ్యం తినరు. ఆళ్లకి గిద్ద మసూరి బియ్యం కావాల. మా మామగారు నా పెళ్లికి సైకిలిత్తానన్నాడు. ఇవ్వనే లేదు. కానీ ఇప్పుడు మా అల్లుడికి పెద్ద బండి తప్ప మరోటి ఇవ్వడానికి లేదు. పూర్వం టీవీ ఉందా లేదు. ఇప్పుడు టీవీ లేకపోతే ఎట్టాగా? టీవీ ఉండాలి. దానికి నెలకి నూట యాభై ఎట్టి కేబుల్ కనెక్షని వ్వాలి. అందులో చూపించే బొట్లు కావాలి, నగలు కావాలి, బట్టలు కావాలి ఇంకా ఏటేటో కావాలి. ఏణ్నుంచొస్తాయండీ డబ్బులు? అందుకే భూమిని పీల్చి పిప్పి చేత్తున్నం. ఇయ్యన్నీ అలా వుండనీ. నా బాధేంటంటే ఇప్పుడు మా నాన్న వ్యవసాయం నేనందుకున్నాను. చెట్లు పెంచాను. పిట్టల్ని పెంచాను. కుటుంబాన్ని పెంచాను. నా తరువాత ఏటవుద్దో..నా కొడుకు వ్యవసాయంలోకి రాడు కదా'' అన్నాడు నిర్లిప్తంగా నిరాశగా.

నా గుండెల్లో ఏదో కలుక్కుమంది. నాయుడు అసలు బాధ ఇదా? తరతరాలు జీవించి, తమని పెంచిన భూమి తల్లిని తన తరంలోనే వదిలేయడం చూడాల్సివస్తుందని నాయుడు కుమిలిపోతున్నాడు. సూరిబాబు వంక చూశాను. అతడు పల్లెలో పుట్టి పెరిగిన వాడే. ! నీ పొలంలో ఈ ఉదయాన ఏమీ తోచని వాడిలా ఆ ప్రాంతానికి అపరిచితుడిలా ఉన్నాడు.

మళ్లీ నాయుడు అన్నాడు. ''మా సూరిగాన్ని చూడండి. మీకు గుర్తుందా, సరిగ్గా నేను ఈడి వయస్సులో ఉండగానే మీరీ ఊరు వొచ్చారు. ఆ టయాంకి నాకు మా పొలంలో ఏ మూలేముందో అన్నీ తెలుసు. ఈడికి కనీసం పొలం ఎలా వెళ్ళాలో, ఎప్పుడెళ్లాలో, ఎందుకెళ్లాలో కూడా తెల్దు. సరే.. ఆడేం పాడైపోలేదు లెండి. ఆడు బాగా సదువుకుంటే నాకు సంబరం కాదా. కాని ఆడు సదివిన సదువు ఆణ్ని ఈ వూరికీ, ఈ భూ తల్లికీ దూరం చేస్సిందండీ. మట్టీ, నేలా..బోదీ..చెట్టూ చేమా.. పిట్టలూ..దూడలు.. ఇయ్యన్నీ ఆడికి ఎకసెక్కమై పోయాయండీ. పేపరు చూత్తాడు, కాయితాలెడతాడు. ఊళ్లు తిరుగుతాడు. ఎవరెవర్నో కలుత్తాడు. ఏం చేత్తాడు. ఏ పనీ దొరకడం లేదు. ఇంత వ్యవసాయం పెట్టుకుని కాలుమీద కాలేసుకుని హాయిగా, ఒకరి దగ్గర తలొంచకుండా బతికే బతుకు నొదులుకుని దేని కోసమండి ఆడి పరుగు? పెద్ద ఉజ్జోగానికి సదువూ లేదు. పల్లెటూరికి పని కొచ్చే చదువూ లేదు. మరెందుకండీసదువు? సదువంటే బతకడానికే కదండీ..మరి అలాంటప్పుడు పల్లెటూరి చదువులో వ్యవసాయం గురించి చెప్పకుండా చదువేటండీ..చెప్పండి చదువుకోక నేను చెడిపోయానా? చదివి వాడు చెడిపోయాడా?'' అన్నాడు.

నేను నిశ్చేష్టుడినయ్యాను.

అవును!

ఎంత చిన్న విషయమిది? గ్రామాలలోని జీవితానికీ, దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధానమైన రంగానికీ చెందిన విషయాలని విద్యగా బోధించడం మాని ఏవేవో విషయాలని చెప్పడం వల్ల విద్య వింతగా పరాయిగా మారిపోయింది? ఇప్పుడు వృత్తులన్నీ కార్పోరేట్ లాభాల మార్కెట్లో మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండి ఆ వృత్తుల్ని ఏసీ గదుల్లో నేర్పి కొత్త రకం పేర్లు పెట్టి అదే ఆధునికం అంటున్నారు. అవే వృత్తుల్ని నేర్చుకోవడం చిన్నతనంగా, వెనుకబాటు తనంగా భావించి ఎందుకూ కొరగాని చదువుల్ని బళ్లలో నేర్పుతున్నామా? ఒకప్పుడు టైలరింగ్ ఒక వృత్తి. ఇప్పుడు లక్షలు పోసి నేర్చుకునే చదువు. వృత్తిని విద్యగా, విద్యని వృత్తిగా మార్చిన దేశంలో ఇలాంటి పరాయితనం ఎలా ప్రవేశించి మనల్ని చెడగొట్టగలిగింది..?

* * *

పది రోజుల తర్వాత ఒక ఆదివారం ఇంట్లో ఉండగా సూరిబాబు వచ్చాడు. సూరిబాబుని చూసి ఆశ్చర్యపోయాను. అతని వేషం మారిపోయింది. జీన్సు ప్యాంటు, పొట్టి చొక్కాలు వేసుకుని ఉండే సూరిబాబు లుంగీ కట్టుకుని, పాత టీషర్టు వేసుకుని ఉన్నాడు. మనిషి కొంచెం నలిగి వున్నాడు. కానీ అతని కళ్ల ఆత్మ విశ్వాసంతో మెరుస్తున్నాయి.

కూర్చున్నాక అన్నాడు. ''మొన్న మా నాన్న చెప్పిన విషయాలు నన్ను తీవ్రంగా కదిలించాయి మాష్టారూ..మనెదురుగా ఉన్న జీవితాన్ని వదిలి పెట్టి మనం అక్కర్లేని జీవితంలోకి వెళ్ళాలనే వెంపర్లాట దేనికి? వ్యవసాయం చేయడంలో వెనుకబాటుతనమూ లేదు. చెడిపోవడమూ లేదు. ఇది అద్భుతమైన కేరీర్ అని చేలోకి దిగాక అర్థమైంది. ఇందులో సాధించడానికి చాలా వుంది'' అన్నాడు.

అతని స్వరంలో పదును నన్ను ఆకట్టుకుంది.

★

